# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు లద్దాఖ్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకాన్ని సందర్శిస్తారు.

**2.** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు రాష్ట్ర శాసన సభలో ఆర్థిక రంగంపై శ్వేతపత్రం విడుదల చేస్తారు.

**3.** ఆంధ్రప్రదేశ్‌లో జల్‌జీవన్ మిషన్ పథకం కింద 73.46శాతం గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించినట్లు కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ వెల్లడించారు.

**4.** తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క 2 లక్షల 91 వేల 159 కోట్ల రూపాయలతో తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు.

**5.** ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

**6.** విశ్వ క్రీడల సంబరం ఒలంపిక్స్ 2024 క్రీడా పోటీలు ఫ్రాన్స్ దేశ రాజధాని ప్యారిస్‌లో ఈరోజు నుంచి ప్రారంభమవుతాయి.

============================

దేశవ్యాప్తంగా ఈరోజు కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటున్నాం. కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం విజయానికి గుర్తుగా ఈ ఉత్సవం నిర్వహిస్తున్నారు. 1999 జూలై 26న కార్గిల్ లో భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. పాకిస్తాన్కు చెందిన ఉగ్రవాదులను భారతసైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. కాశ్మీర్ ను ఆక్రమించాలనుకున్న పాకిస్తాన్ ప్రయత్నాన్ని భారత జవాన్లు సమర్థంగా ఎదుర్కొన్నారు. పాకిస్తాన్ పై భారత్ సాధించిన చారిత్రాత్మక విజయాన్ని స్మరించుకుంటూ భరతమాత కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్లను తలుచుకుంటూ... ఈరోజు ను కార్గిల్ ‘విజయ్ దివస్’గా దేశమంతటా జరుపుకుంటున్నాం. కార్గిల్ యుద్ధంలో మన దేశం పాకిస్తాన్ పై విజయం సాధించి నేటికి సరిగ్గా 25 సంవత్సరాలు. కార్గిల్ “విజయ్ దివస్” రజతోత్సవం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఈరోజు లద్దాఖ్‌లోని కార్గిల్

యుద్ధ స్మారకాన్ని సందర్శిస్తారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సైనికులకు నివాళు లర్పిస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు రాష్ట్ర శాసన సభలో ఆర్థిక రంగంపై శ్వేతపత్రం విడుదల చేస్తారు. శాసనసభ సమావేశాలు ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి ఈ రోజు సాయంత్రం ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన రేపు జరిగే నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

ముఖ్యమంత్రి అధ్యక్షతన నిన్న సాయంత్రం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి మండలి సమావేశం నిర్వహించిన సందర్భంగా ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి నిధులు కేటాయించినందుకు రాష్ట్ర మంత్రి వర్గం కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. పోలవరం ప్రాజెక్ట్, రాజధాని అమరావతి నిర్మాణాలపై చర్చించారని, సమావేశంలో పోలవరం ప్రాజెక్ట్ డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి మంత్రి మండలి ఆమోదం తెలిపిందని అధికారిక వర్గాలు తెలిపాయి.

---------------------------

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర శాసన సభలో 2024-25 బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను నిన్న ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా 2 లక్షల 91 వేల 159 కోట్ల రూపాయలతో రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించామని మంత్రి తెలిపారు. ఇందులో మూలధన వ్యయం 33,487 కోట్ల రూపాయాలుగా పేర్కొన్నారు. పన్ను ఆదాయం 1 లక్షా 38 వేల 181.26 కోట్లు, పన్నేతర ఆదాయం 35 వేల 208.44 కోట్ల రూపాయలు కాగా, కేంద్ర పన్నుల్లో వాటా 26 వేల 216.28 కోట్లు, కేంద్రం నిధులు 21 వేల 636.15 కోట్లుగా పేర్కొన్నారు. ఈ ఏడాది నిజాం షుగర్స్‌ను తిరిగి ప్రారంభిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్ద మొత్తంలో 72 వేల 659 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ఇది చరిత్రాత్మక నిర్ణయమని. దేశ చరిత్రలో వ్యవసాయ రంగానికి ఒక మైలురాయి అని పేర్కొన్నారు.రైతు భరోసాతో సహా ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. 2024-25 సంవత్సరానికి రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో పంట సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని ఆర్థికమంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది జులై 23 నాటికి 73.46శాతం గ్రామీణ గృహాలకు జల్‌జీవన్ మిషన్ పథకం కింద తాగునీరు అందించినట్లు కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని ఇళ్లకు తాగునీరు అందించారని లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో నరసరావు పేట, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద ఆంధ్రప్రదేశ్‌లో 2021-22లో 70.72 కోట్ల అంచనా వ్యయంతో 135 జలవనరుల మరమ్మతులకు అనుమతి ఇచ్చినట్లు కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయమంత్రి రాజ్‌భూషణ్ చౌధరి తెలిపారు. వీటిలో 33 జలవనరులు అనంతపురం జిల్లాలో ఉన్నాయని, అనంతపురం, హిందూపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా అభివృద్ధి ఫలాలు చేరాలనే లక్ష్యంతో

ఆకాంక్షాత్మక జిల్లాలు, విభాగాల కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం నీతి ఆయోగ్ 3 నెలల పాటు 'సంపూర్ణతా అభియాన్' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ నెల 4వ తేది నుంచి సెప్టెంబర్ 30 వరకు ఈ ప్రచారం కొనసాగనుంది. దేశ వ్యాప్తంగా ఆకాంక్ష జిల్లాల్లో 6 సూచికలు, ఆకాంక్ష బ్లాకుల్లో 6 కీలక సూచికల సంతృప్తతను సాధించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆకాంక్షాత్మక జిల్లాలు, విభాగాల సంపూర్ణతా అభియాన్ కార్యక్రమంపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వార్తా వ్యాఖ్య కార్యక్రమం ఈ రోజు ఉదయం 8:30 లకు ప్రసారమవుతుంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

విశ్వ క్రీడల సంబరం ఒలంపిక్స్ 2024 క్రీడా పోటీలు ఫ్రాన్స్ దేశ రాజధాని ప్యారిస్‌లో ఈరోజు నుంచి ప్రారంభమవుతాయి. ఆగస్టు 11వ తేదీ వరకు మొత్తం 17 రోజుల పాటు ఈ క్రీడా పోటీలు జరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా 206 దేశాల నుంచి మొత్తం 10 వేల 714 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. 32 క్రీడలకు సంబంధించి 329 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. టోక్యోలో జరిగిన 2020 ఒలంపిక్స్‌లో భారత్ స్వర్ణం సహా ఏడు పతకాలు గెలిచింది. ప్యారిస్ ఒలంపిక్స్‌లో భారత్ నుంచి 117 మంది క్రీడాకారులు.. 15 క్రీడాంశాల్లో పోటీపడనున్నారు. ప్యారిస్ ఒలింపిక్ క్రీడల ప్రారంభ వేడుకలు ఈ రోజు రాత్రి 11 గంటలకు ప్రారంభమవుతాయి. ఒలింపిక్స్‌లో భారత్ ప్రస్తానం విలువిద్య పోటీలతో ప్రారంభమైంది. మహిళల విలువిద్య బృందం విభాగంలో భారత జట్టు నాలుగో స్థానంలో నిలిచి క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది.

---------------------------

ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగానికి లోక్ అదాలత్, ప్రజా కోర్టులు ఎంతో కీలకమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా అన్నారు. ఆకాశవాణికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, న్యాయస్థానం వెలుపల వివాదాలను పరిష్కరించడంలో లోక్ అదాలత్ లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ నెల 29వ తేదీ నుండి వచ్చే నెల 3వ తేదీ వరకు జరగనున్న సుప్రీంకోర్టు ప్రత్యేక లోక్ అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని తమ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. సుప్రీంకోర్టు మారుమూల ప్రాంతాల్లో నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్‌లో దృశ్య మాధ్యమ సౌకర్యం కూడా ప్రవేశపెడతామని జస్టిస్ ఖన్నా తెలియచేశారు.

---------------------------

నీట్ యూజీ 2024 పరీక్ష వివాదంపై ఇటీవల దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువరించడంతో సవరించిన ఫలితాలను జాతీయ పరీక్షా సంస్థ- ఎన్టీఏ నిన్న విడుదల చేసింది. భౌతిక శాస్త్ర విభాగంలోని ఒక ప్రశ్నకు ఒకటే సమాధానం ఉంటుందని నిపుణుల కమిటీ తేల్చడంతో దాని ఆధారంగా ఫలితాలను సవరించాలని సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు ఈ ఫలితాలను ఎన్టీఏ వెల్లడించింది. ఇందులో 4.2 లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులను కోల్పోయారు. దీంతో మొదటి ర్యాంక్ సాధించిన వారి సంఖ్య కూడా 61 నుంచి 17కు తగ్గింది.

======================